

21న గణిత అష్టావధానం

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురంలోని శ్రీఅరవింద డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన నేషనల్ మ్యాథమెటిక్స్ డే సందర్భంగా "గణిత అష్టావధాన" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టికె.విశ్వేశ్వరరావు తెలిపారు. గణితశాస్త్రంలో మేధోపరమైన నూతన ఆవిష్కరణలకు ఈ అవధానం తోడ్పడుతుందని, అవధాని డాక్టర్ ఎస్‌విఎస్.సుబ్రహ్మణ్యం అవధానం నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా వివిధ డిగ్రీ, జూనియర్ కళాశాలల, పాఠశాలల గణిత అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. గణిత అష్టావధానానికి సంబంధించిన పోస్టర్, బ్రోచర్లను ఎపి కళాశాల విద్య జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రాపాక డేవిడ్ కుమారస్వామి, అధికారులు బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేవారు తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని ప్రిన్సిపల్ తెలిపారు.

మెడికల్ కాలేజీ ప్రారంభమయ్యేనా..!

పునాది దశ దాటని భవనాల నిర్మాణం
2023లో 150 సీట్ల కేటాయింపు
ఈ నెలలోనే ఎన్‌ఎంసి బృందం ఇన్‌స్పెక్షన్
ఆ బృందం అనుమతిస్తేనే తరగతులు ప్రారంభం
భవనాల నిర్మాణంపై నీలినీడలు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు మెడికల్ కాలేజీ భవనాల నిర్మాణం ఈ ఏడాది పూర్తయ్యేనా.. అనుకున్న ప్రణాళిక ప్రకారం 2023లో తరగతులు ప్రారంభమయ్యేనా.. జిల్లావాసులు ఎదురుచూస్తున్న ఏళ్లనాటి మెడికల్ కాలేజీ కల నెరవేరేనా అంటే ఏ ఒక్కరూ సమాధానం చెప్పలేని పరిస్థితి నెలకొంది. వచ్చే ఏడాది మెడికల్ కాలేజీ తరగతులు ప్రారంభిస్తామని చెబుతున్నప్పటికీ ఇప్పటికీ భవనాల నిర్మాణం పునాదుల దశను దాటలేదు. దీంతో వచ్చే ఏడాది మెడికల్ కాలేజీ ప్రారంభంపై పలు అనుమానాలు నెలకొన్నాయి. టిడిపి ప్రభుత్వ హయాం నుంచి ఇప్పటి వరకూ ఏలూరులో మెడికల్ కాలేజీ ఏర్పాటుపై శంకుస్థాపనల పర్వం సాగడమే తప్ప కాలేజీ మాత్రం ప్రారంభంకాలేదు. ఈ ఏడాది కచ్చితంగా క్లాసులు ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం, అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం అందుకు విరుద్ధంగా కొనసాగుతున్నాయి. ఏలూరు మెడికల్ కాలేజీ నిర్మాణానికి రూ.525 కోట్లు కేటాయించినట్లు ప్రభుత్వం గొప్పగా చెప్పింది. భవనాల నిర్మాణానికి సంబంధించి ఏలూరులోని జిలా ప్రభుత్వాసుపత్రిలోని స్థలాన్ని తొలుత ఎంపిక చేశారు. తర్వాత బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. మళ్లీ ప్రభుత్వాసుపత్రి ఆవరణలోనే ఏర్పాటు చేస్తామని ప్రకటించి చిట్టచివరికి ఏలూరు పాతబస్టాండ్ సమీపంలోని డిఎంహెచ్‌ఒ కార్యాలయ ప్రాంగణంలో కాలేజీ భవన నిర్మాణానికి పూనుకున్నారు. వచ్చే ఏడాది మే మొదటి వారంలో జాతీయ స్థాయిలో మెడిసిన్‌కు సంబంధించిన నీట్ పరీక్ష జరగనుంది. ఫలితాల అనంతరం 2023 ఆగస్టులో మెడికల్ సీట్లు కేటాయించనున్నారు. ఏలూరు మెడికల్ కాలేజీకి తొలిఏడాది 150 సీట్లు కేటాయించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఇంత వరకూ బాగానే ఉంది. విద్యార్థులకు సీట్లు కేటాయిస్తే తరగతులు ఎక్కడ నిర్వహిస్తారనే ప్రశ్న అందరినీ తొలిచేస్తోంది. ఎందుకంటే ఇప్పటికీ మెడికల్ కాలేజీ భవనాల నిర్మాణ పనులు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉన్నాయి. దీంతో వచ్చే ఏడాది ఆగస్టు నాటికి భవన నిర్మాణ పనులు పూర్తిచేసి తరగతులు ప్రారంభించడంపై నీలినీడలు కమ్ముకున్నాయి.

ఎన్‌ఎంసి బృందం అనుమతిస్తేనే తరగతులు

మెడికల్ కళాశాల తరగతులు ప్రారంభం కావాలంటే నేషనల్ మెడికల్ కౌన్సెల్ అనుమతి తప్పనిసరి. ఈ ఏడాది నుంచి మెడికల్ కాలేజీ ప్రారంభానికి అనుమతి ఇవ్వాలంటే ఎన్‌ఎంసి బృందం ఇన్‌స్పెక్షన్ పూర్తికావాల్సి ఉంది. ఈ నెలలోనే ఈ బృందం వచ్చి ఇన్‌స్పెక్షన్ చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఎన్‌ఎంసి బృందాన్ని మెప్పించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే మెడికల్ కాలేజీకి సంబంధించిన సిబ్బంది నియామకం పూర్తయినట్లు చెబుతున్నారు. ప్రిన్సిపల్, ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం పూర్తయ్యిందని అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా బోధనా ఆసుపత్రిగా మారనున్న ఏలూరు ప్రభుత్వాసుపత్రిలోనూ పలు మార్పులు చేశారు. కానీ అత్యంత కీలకమైన తరగతి గదుల భవనాలు మాత్రం పునాదులు దాటలేదు. దీంతో ఎన్‌ఎంసి బృందం సంతృప్తి చెందుతుందా.. లేక అసంతృప్తి వ్యక్తంచేస్తుందా అన్న అనుమానం నెలకొంది. ఈ ఏడాది తరగతులు ఖచ్చితంగా ప్రారంభమవుతాయని అధికారులు చెబుతున్నప్పటికీ పరిస్థితులు మాత్రం అందుకు అనుకూలంగా లేని పరిస్థితి కనిపిస్తోంది. దీంతో ఇన్‌స్పెక్షన్ జరిగే వరకూ టెన్షన్ తప్పదని చెప్పొచ్చు.

రూ.90 లక్షలతో రెవెన్యూ విశ్రాంతి భవనం

శంకుస్థాపన చేసిన కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



శంకుస్థాపన చేస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు తీరుపై వివిధ ప్రభుత్వ హోదాలో ఉన్న విఐపిలు జిల్లాకు వచ్చినప్పుడు వారు బస చేసేందుకు రెవెన్యూ విశ్రాంతి భవనం ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఆదివారం ఉదయం కలెక్టరేట్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో ఉన్న గిరిజన భవన్ వద్ద శిథిలావస్థలో ఉన్న పాత రెవెన్యూ విశ్రాంతి భవనాన్ని తొలగించి వాటి స్థానంలోనే రెవెన్యూ విశ్రాంతి భవన నిర్మాణానికి కలెక్టర్ జిల్లా అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా శిథిలావస్థలో ఉన్న పాత రెవెన్యూ విశ్రాంతి భవనాన్ని తొలగించి దానిస్థానంలో 90 లక్షలతో నూతన రెవెన్యూ విశ్రాంతి భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల పరిశీలన నిమిత్తం విఐపిలు, అధికారులు జిల్లాకు వచ్చినప్పుడు ఈ భవనంలో వారు బస చేసేందుకు ఉపయోగపడుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ భవనం 4250 చదరపు అడుగుల్లో జి ప్లస్-1 కింద రెండు విఐపి సూట్స్, మూడు గెస్ట్ రూములతో మోడరన్‌గా నిర్మిస్తామని తెలిపారు. భవన నిర్మాణం ఉగాదికి పూర్తి చేయించాలని హౌసింగ్ పీడీ వేణుగోపాల్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎవిఎన్ఎస్. మూర్తి, జెడ్‌పి సిఇఒ రవికుమార్, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, ఏలూరు ఆర్‌డిఒ కె.పెంచలకిషోర్, పంచాయతీరాజ్ ఎస్ఇ చంద్ర భాస్కర్, మున్సిపల్ అదనపు కమిషనర్ బాపిరాజు, హౌసింగ్ ఇఇ నరసింహారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇఇ బివివి.గిరి, కాంట్రాక్టర్ పి.శ్రీనివాస్‌రాజు పాల్గొన్నారు.

టెలీ మెడిసిన్ హబ్‌లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఏలూరు

జాతీయ ఆరోగ్య మిషన్, హెల్త్ వెల్ నెస్ సెంటర్‌లోని టెలీ మెడిసిన్ హబ్‌లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌హెచ్‌ఎం మిషన్ డైరెక్టర్, ఏలూరు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో టెలీమెడిసిన్ హబ్‌లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నామని తెఇపారు. ఏలూరు జిల్లా కేంద్ర ఆసుపత్రిలో, తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలో ప్రత్యేక మెడికల్ ఆఫీసర్ ఫిజీషియన్ రెండు పోస్టుల భర్తీకి ఎమ్‌డి(జనరల్ మెడిసన్) ఎపి మెడికల్ కౌన్సిల్‌లో రిజిష్టర్ అయి తాజా తేదీ వరకూ రెన్యూవల్ చేసినవారు దరఖాస్తు చేయొచ్చన్నారు. వీరికి నెలకు లక్ష రూపాయలు గౌరవ వేతనం ఇస్తామని చెప్పారు. అర్హతగల అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు విద్యార్హతలకు సంబంధించి ఒరిజినల్ సర్టిఫికెట్స్, నాలుగో తరగతి నుండి పదో తరగతి వరకూ స్టడీ సర్టిఫికెట్స్, తాజా కుల ధృవీకరణ పత్రం, గెజిటెడ్ అధికారిచే ధృవీకరించిన ఒక జిరాక్స్ సెట్ ఏలూరులోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో ఈనెల 19వ తేదీ ఉదయం 10.30 గంటలకు హాజరు కావాలని రవి తెలిపారు. పూర్తి వివరాలకు అభ్యర్థులు https://westgodavari.ap.gov.in, https://eluru.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. ఎంపిక విధానం ఎన్‌హెచ్‌ఎం మిషన్ డైరెక్టర్ వారి సూచనల మేరకు ఉంటుందని, ఖాళీల సంఖ్య పెంపు, లేదా కుదింపునకు జిల్లా సెలక్షన్ కమిటీ వారికి పూర్తి అధికారాలుంటాయని తెలిపారు.

ప్లాంటేషన్ల అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి - ఏలూరు

ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి సంస్థ వైస్‌ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌చే ఆమోదించబడిన అటవీ షెడ్యూల్డ్ రైట్స్, కార్యకలాపాల క్యాలెండర్‌ను అనుసరించి ప్లాంటేషన్లలో పనులు చేపడుతున్నామని అటవీ అభివృద్ధి సంస్థ డివిజనల్ మేనేజర్ ఎ.సత్యకళ ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు డివిజన్‌లో భాగమైన జంగారెడ్డిగూడెం రేంజిలో సుమారు 32 హెక్టార్ల విస్తీర్ణంలో 2021లో జీలుగుమిల్లిలో, 15 హెక్టార్ల విస్తీర్ణంలో దర్భగూడెంలో టేకు మొక్కలు నాటామని తెలిపారు. ప్లాంటేషన్ల అభివృద్ధిలో భాగంగా రెండు విధాలా పనులను చేపట్టి అందులో మట్టి పనిలో భాగంగా మొక్కచుట్టూ 50 సెంటీమీటర్ల విస్తీర్ణంలో 15 సెంటీమీటర్ల లోతుకు మట్టిని కప్పి సుమారు 20 గ్రాముల డిఎపి మందును సెప్టెంబర్, అక్టోబరు నెలల్లో వేశామన్నారు. అదే విధంగా టేకు మొక్కల మధ్యలో పెరిగే అనవసర మొక్కలను తొలగిస్తామన్నారు. ఈ రెండు పనుల నిర్వహణకు సంబంధించి రూ.1,93,600 సొమ్మును డివిజన్ ఆఫీసు నుండి మంజూరు చేశామని తెలిపారు. కానీ దీనికి విరుద్ధంగా జీలుగుమిల్లి ప్లాంటేషన్‌లో పైలాన్ చుట్టూ ఉన్న మొక్కల మినహా ప్లాంటేషన్ లోపలి భాగంలో ఉన్న మొక్కలకు మట్టి పనులు జరగలేదని, ఎరువులు వేయలేదని వచ్చిన ఫిర్యాదుల్లో వాస్తవం లేదని ఆమె స్పష్టం చేశారు. రెండో దఫాగా మొదటి సంవత్సరం టేకు మొక్కల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా 2021లో జీలుగుమిల్లిలో టేకు మొక్కల మధ్యలో ఉన్న పనికిరాని మొక్కలను తొలగించు పనిని ఈనెలలో చేపడతామన్నారు. అదేవిధంగా 2022లో కొత్తగా దర్భగూడెంలో నాటిన టేకు మొక్కల మధ్యన ఉన్న అనవసర మొక్కల తొలగింపు, మొక్క చుట్టూ నీరు నిలిచి మొక్క అభివృద్ధికి తోడ్పడే విధంగా 50 సెంటీమీటర్ల విస్తీర్ణం, 15 సెంటీమీటర్ల లోతు గల కప్పు ఆకారంలో మట్టి అమర్చే పనిని కూడా ఈ నెలలో చేపట్టాల్సి ఉందని పేర్కొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - ఏలూరు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ఉపాధ్యక్షులు భజంత్రీ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఏలూరులోని ఎఐటియుసి జిల్లా కార్యాలయంలోని స్ఫూర్తి భవనంలో ఏలూరు నగర సమితి ఆఫీస్ బేరర్ల సమావేశము కసింకోట నాగేంద్ర అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ ఏలూరు ఆరోగ్యాలను పణంగా పెట్టి విధులు నిర్వర్తిస్తున్న కార్మికులను ప్రభుత్వం విస్మరించడం అన్యాయమన్నారు. వారి సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేయడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని కోరారు. ఈనెల 27న ఏలూరు నగర మున్సిపల్ యూనియన్ మహాసభ నిర్వహించేందుకు సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశంలో యూనియన్ కోశాధికారి పుచ్చ శంకర్, ఉపాధ్యక్షులు ఇంటి అశోక్, బంగారు దుర్గాప్రసాద్, సహాయ కారదర్శి వై.శివకుమార్, రాగాతు నూకరాజు, కార్యనిర్వాహక కార్యదర్శి మాడుగుల జగదీష్ పాల్గొన్నారు.



తడిసిన ధాన్యం అరబెడుతున్న రైతు

ముదినేపల్లిలో వర్షం.. రైతులకు నష్టం

ప్రజాశక్తి - ముదినేపల్లి

రైతులను వాన కష్టాలు వదలడంలేదు. తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు మండలంలో ఇప్పటికే రైతులు తీవ్రంగా నష్టపోయారు. వర్షాలు కాస్త తెరిపి ఇవ్వడంతో మిగిలిన పంటను కాపాడుకునే ప్రయత్నాల్లో రైతులు ఉన్నారు. ఈ దశలో శనివారం రాత్రి ఆకస్మాత్తుగా మండలంలోని పలు గ్రామాల్లో భారీగా వర్షం కురిసింది. దీంతో కోసిన పనలపై ఉన్న వరి పైరు తడిసిపోయింది. కల్లాల్లోకి వర్షపు నీరు వచ్చి చేరడంతో ధాన్యాపు రాసులు తడిశాయి. దీంతో ఆదివారం ఉదయన్నే ఉరుకులు, పరుగులు మీద రైతులు కల్లాలో నిలిచిన వర్షపు నీటిని బయటకు మళ్లించే పన్నుల్లో నిమఘ్నమయారు. తుపాన్ గండం గడచింది దేవుడా అనుకునే లోపు మళ్లీ భారీ వర్షం కురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం వర్షపు నీటికి తడిసిపోయింది. పంటలు చేతికి వచ్చే సమయంలో అకాల వర్షాలు తుపాన్ కారణంగా అన్నదాతలు ఊసూరుమంటున్నారు. మండలంలో ముమ్మరంగా వ్యవసాయ పనులు జరుగుతున్న తరుణంలో మళ్లీ కురిసిన వర్షం రైతులను కోలుకొని దెబ్బతీసిందని రైతులు అంటున్నారు. మండలవ్యాపంగా ఏడు వందల ఎకరాల్లో కోసిన వరిపైరు పనలపై ఉంది. దీనికి తోడు తేమ శాతం ఎక్కువగా ఉందనే సాకుతో అటు రైతులను మిల్లర్లు, అటు ఆర్‌బికె అధికారులు ముప్పతిప్పలు పెడుతున్నారు. ఒకపక్క వర్షం, మరోపక్క ధాన్యం కొనేందుకు అధికారులు పెట్టే నిబంధనలతో రైతులు లబోదిబోమంటున్నారు. వాతావరణంలో మార్పులు, శీతాకాలం కావడంతో ధాన్యం ఆరేందుకు వారాలు సమయం పడుతుంది. ఈ లోగా మళ్లీ వర్షం పడడంతో రైతులు పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిబంధనలు సడలించి తడి, పొడి ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని మండలంలోని రైతాంగం ప్రభుత్వాన్ని కోరుతోంది.

ఆక్వా రైతు కుదేలు..!

చుట్టుముట్టిన కష్టాలు - పెట్టుబడులు పెట్టబోమంటున్న మందుల దుకాణాలు - మరోవైపు వ్యాధుల విజృంభణ - ధర పతనం

ప్రజాశక్తి - కాళ్ల

ఆక్వా సాగులో రైతులకు ఒడిదుడుకులు తప్పడం లేదు. రాష్ట్ర వృద్ధిరేటులో కీలక భూమిక పోషిస్తున్న ఆక్వారంగం ఎప్పుడు ఎలా ఉంటుందో అంతుచిక్కక రైతులు అయోమయానికి గురవుతున్నారు. వాతావరణంలో మార్పులు, నాణ్యతలేని రొయ్య పిల్లలను తెచ్చి చెరువుల్లో వదలడం, అవి కొన్ని రోజులకు వ్యాధుల బారిన పడటం మరోవైపు ధరల పతనం రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దీనికితోడు రొయ్యల పెంపకంలో రైతులకు వెన్నుదన్నుగా నిలిచిన డీలర్లు మేత మందులు, ఇతర మెటీరియల్స్ ఇవ్వలేమని చెబుతుండటంతో ఆక్వా రైతులు ఆందోళనకు గురవుతున్నారు.రొయ్యల కొనుగోలు ఆశాజనకంగా లేకపోవడంతో మార్కెట్‌లో ఆర్థికమాంద్యం దృష్ట్యా, అరువుపై విక్రయాలు నిలిపివేస్తున్నట్లు నిర్మొహమాటంగా చెప్పేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో డీలర్లు సబ్ డీలర్లు ఆక్వా రైతులకు రొయ్యల మేత, మందుల సరఫరా చేసి డీలర్ల అసోసియేషన్ అప్పు నిలిపివేస్తున్నట్లు తేల్చి చెప్పారు. దీంతో రొయ్యల పెంపకందారులకు పుండుపై కారం చల్లినట్లయింది. ఉండి, భీమవరం, పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాల్లో పలువురు డీలర్లు అప్పు పద్ధతికి స్వస్తి పలుకుతున్నారు. రొయ్య పిల్లలను చెరువులో వేశాక రెండు, మూడు నెలలపాటు సొంత పెట్టుబడితో సాగు చేయాలని కౌంట్ పెరిగిన తర్వాత చూద్దామని చెబుతున్నారు. చిన్న, సన్నకార రైతులు అవస్థలు పడుతున్నారు.అధిక ఆదాయం ఆశించి ఎంతోమంది ఈ రంగంలోకి అడుగుపెట్టి దిగుబడులను రెట్టింపు చేస్తున్నారు. ధరలను మాత్రం మధ్యవర్తులు శాసిస్తున్నారు. ఆక్వాసాగులో రూ.లక్షలు పెట్టుబడి పెడుతున్న రైతులు నష్టాలతో కుదేలవుతున్నారు. మేత ధర పెరిగిపోవడం, నాణ్యతలేని సీడ్, నిలకడలేని ధరలు, విద్యుత్ సబ్సిడీపై ఆంక్షలు, కోల్డ్ స్టోరేజీలు లేకపోవడం వంటి సమస్యలతో పాటు అనేక సమస్యలు ఆక్వా సాగును చుట్టుముట్టాయి. ఆక్వా సాగుకు ప్రత్యేక చట్టాలున్నా అమలు కాని పరిస్థితి ఉంది.

ఆక్వా రైతులను ప్రోత్సహించి మద్దతు ధర కల్పించడంతోపాటు నాణ్యమైన సీడ్, ఫీడ్‌ను అందించి జిల్లాలో ఆక్వారంగాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఎన్నికల ముందు ముఖ్యమంత్రి జగన్ హామీ ఇచ్చారు. ఆక్వాసాగుకు ప్రత్యేకంగా చట్టం తీసుకొస్తామని రైతులకు భరోసా కల్పించారు. అయితే అధికారం చేపట్టాక ఈ మూడున్నరేళ్ల కాలంలో ఆక్వా రైతుల అభివృద్ధి ఎక్కడవేసిన గొంగళి అక్కడే ఉంది. విదేశీ మారకద్రవ్యాన్ని పెద్దమొత్తంలో ఆర్జిస్తున్నా ఆక్వాసాగుపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించడం గమనార్హం. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1,77,862 ఎకరాల్లో రైతులు ఆక్వా సాగుచేస్తున్నారు. దీనిలో 79,768 ఎకరాల్లో రొయ్యల సాగవుతోంది. ఒక్క పశ్చిమగోదావరి జిల్లాలో 49,040 వేల ఎకరాల్లో రొయ్యల సాగు జరుగుతోంది. ప్రతిఏటా ఇక్కడి నుంచి దాదాపు 15 లక్షల మెట్రిక్ టన్నుల ఆక్వా ఎగుమతులు జరుగుతున్నాయి. ఏడాదికి రూ.14 వేల కోట్లకుపైగా ప్రభుత్వానికి ఆదాయం లభిస్తోంది. రోజురోజుకీ మేత ధరలు ఆకాశాన్నంటడం, నాణ్యత లేని సీడ్ సరఫరా ఈ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీనికితోడు నిలకడలేని ధరలు వెంటాడటంతో రైతులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. దీనికితోడు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీపై ఆంక్షలు విధించడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పెట్టుబడికి, రాబడికి సంబంధం లేకుండా ఉంది. ప్రతి ఎకరాకూ రూ.70 వేల నుంచి రూ.లక్ష వరకూ నష్టం వాటిల్లుతుందని రైతులు చెబుతున్నారు. మేత ధరలపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో వ్యాపారులంతా సిండికేట్‌గా మారి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఎంపెడా సంస్థ సైతం ఆక్వా సాగుకు దన్నుగా నిలవని పరిస్థితి ఉంది. ఉత్పత్తి అయిన రొయ్యలను నిల్వ చేసుకునే కోల్డ్ స్టోరేజీ లేకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పట్లేదు.

సబ్సిడీలో ఆంక్షలు : ఆక్వా సాగులో 80శాతం చిన్న, సన్నకారు రైతులే. ఆక్వారంగానికి చేయూతనిచ్చి అభివృద్ధి చేస్తామని గొప్పలు చెప్పిన వైసిపి ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీలోనూ ఆంక్షలు విధించింది. గతంలో ఆక్వా రంగంలో ఒక్కో యూనిట్‌కు రూ.3.85 వసూలు చేసేవారు. టిడిపి హయాంలో రూ.1.35 రాయితీ ఇచ్చారు. అప్పట్లో యూనిట్‌కు రూ.2.50 మాత్రమే వసూలు చేసేవారు. వైసిపి అధికారం చేపట్టాక తొలి రోజుల్లో యూనిట్‌కు మరో రూపాయి తగ్గించి రూ.1.50కే సరఫరా చేయడంతో ఆక్వా రైతులంతా సంబరపడిపోయారు. అయితే ఈ సంతోషం మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. పది ఎకరాల్లోపు ఉన్న రైతులకు మాత్రమే విద్యుత్ సబ్సిడీ వర్తిస్తుందని చెప్పడంతో 80 శాతం మంది రైతులు రాయితీని కోల్పోయారు. ఆక్వా జోన్ పరిధిలో సాగు చేసే వారు కాకుండా నాన్ ఆక్వా జోన్ పరిధిలో సాగు చేసే రైతులు 80 శాతం మంది చిన్న, సన్నకార రైతులే ఉన్నారు. వీరంతా విద్యుత్ రాయితీని కోల్పోవడంతో ఒక్కో ఎకరాకు అదనంగా రూ.18 వేలు భారం పడుతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే విద్యుత్ కోతలతో రైతులకు అవస్థలు తప్పట్లేదు. ప్రత్యేకంగా జనరేటర్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. డీజిల్ ధరలు కూడా అధికంగా ఉండటంతో అదనపు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటీవల వాంద్రం గ్రామంలో జరిగిన రొయ్యల సాగుపై అవగాహన సదస్సులో రాజ్యసభ సభ్యులు బీద మస్తానరావు రైతుల కొరకు కిలో మేత ధర రూ.67కే అందిస్తామని స్పష్టం చేశారు.

హమాలీలకు ఉపాధి భద్రత కల్పించాలి : ఇఫ్టూ

ప్రజాశక్తి - ఏలూరు

ఎండనకా, వాననకా కష్టపడి పనిచేస్తూ సమాజాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న హమాలీ కార్మికులకు ఉపాధి భద్రతతో కూడిన సమగ్ర చట్టం చేయాలని ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు(యువి), నగర ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, యార్డ్ హమాలీ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రెడ్డి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం ఏలూరు మార్కెట్‌యార్డులో ఏలూరు హమాలీ జట్టు కార్మిక సంఘం 18వ వార్షికసభ నిర్వహించారు. యూనియన్ ఉపాధ్యక్షులు సందక అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో వారు మాట్లాడారు.



మందులు అందిస్తున్న వైద్యులు

పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలి

ప్రజాశక్తి - దెందులూరు

పేదలందరికి కార్పొరేట్ స్థాయిలో ఉచితంగా వైద్యం అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి డిమాండ్ చేశారు. మండలంలోని దోసపాడు గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆర్‌ఎంఒ డాక్టర్ పిఎఆర్ఎస్.శ్రీనివాసరావు ప్రారంభించారు. అంజనీ దశరథ్ ఆసుపత్రి వైద్యులు ఈడ్పుగంటి ఠాగూర్ ప్రసాద్ వైద్య సేవలు అందించారు. కంటి వైద్య టెక్నీషియన్ వేణుగోపాల్ కంటి పరీక్షలు నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో దోసపాడు గ్రామంలో పేదలు, దళితుల అసైన్డ్ భూముల కోసం పోరాటం నడుస్తుందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం పోరాటాలే కాకుండా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. వైద్య రంగంలో కార్పొరేట్ సంస్థల ప్రవేశంతో పేదలకు వైద్యం అందని పరిస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వాలు పేదలకు వైద్యం అందించే ప్రభుత్వ వైద్యం అభివృద్ధి చేయకుండా, కార్పొరేట్ సంస్థలకు రాయితీలు ప్రోత్సాహకాలు ఇస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కేరళ తరహాలో ప్రతి గ్రామంలో డాక్టర్‌తో కూడిన ప్రభుత్వ ఆసుపత్రులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వైద్య శిబిరంలో రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.కిషోర్, మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వివివిఎన్.ప్రసాద్, తిప్పాని లక్ష్మీకాంతం, మెమోరియల్ ట్రస్టు నిర్వాహకులు కె.రామాంజనేయులు, మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ నాయకులు సిహెచ్.సీతయ్య, అంతోని, కార్తిక్, శ్రీనివాస్, సంఘం నాయకులు పి.ఆనందరావు, జాన్‌రాజు, సునీల్, పవన్ తేరేజమ్మ, లలిత, మాణిక్యం సహాయ సహకారాలు అందించగా స్థానిక పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

కంటితుడుపుగా నూతన కల్లు పాలసీ

స్పష్టమైన విధి విధానాలు ప్రకటించాలి - ఎపి గీత కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రభుత్వం ప్రకటించిన నూతన కల్లు పాలసీ కంటితుడుపు చర్యగా ఉందని ఎపి గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మునిస్వామి, జుత్తిగ నరసింహమూర్తి అన్నారు. సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం తాడేపల్లిగూడెంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో కామన మునిస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఈ సందర్భంగా మునిస్వామి, నరసింహమూర్తి మాట్లాడుతూ ఈ ఏడాది అక్టోబర్ 31న ప్రభుత్వం ప్రకటించిన కల్లు పాలసీ కంటి తుడుపు చర్యగా ఉందన్నారు. గత మూడు సంవత్సరాలుగా రాష్ట్రవ్యాప్తంగా గీత కార్మికులు 20 డిమాండ్లతో ఆందోళనలు చేస్తున్నారని, ఒక ఎక్స్‌గ్రేషియా మాత్రమే ప్రకటించారని ఇది గీత కార్మికుల పోరాట విజయమని వారు పేర్కొన్నారు. మిగిలిన డిమాండ్లపై ఆందోళనలు, పోరాటాలు కొనసాగిస్తామని వారు హెచ్చరించారు. శాశ్వత వికలాంగునకు రూ.10 లక్షలు, సహజ మరణానికి రూ.5 లక్షలు, తాత్కాలిక వికలాంగులకు లక్ష రూపాయలు చొప్పున, ప్రమాదంలో మరణించినవారికి రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రభుత్వమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. వైఎస్ఆర్ గీత కార్మిక భరోసాకు లేబర్ డిపార్టమెంట్‌కు లింక్ పెట్టడం సరికాదన్నారు. ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ ద్వారానే అన్నీ అమలు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. గౌడ, శెట్టిబలిజ, ఈడిగ, శ్రీసైన, యాత కులాలకు కార్పొరేషన్లు పెట్టి కొంతమందికి పదవులు కట్టబెట్టారు తప్ప గీత కార్మికులకు ఒరిగిందేమీ లేదని వారు ప్రభుత్వాన్ని విమర్శించారు. 1991లో పోరాడి ఉమ్మడి రాష్ట్రంలో సాధించుకున్న కల్లు గీత కార్పొరేషన్‌కు తక్షణం రూ.ఐదు వేల కోట్ల నిధులు కేటాయించి గీత కార్మికుల సంక్షేమానికి పనిచేయాలని వారు డిమాండ్ చేశారు. జిఒ 560 ప్రకారం ప్రతీ కల్లు సొసైటీకి చెట్లు పెంచడానికి ఐదు ఏకరాల భూమిని ఇవ్వాలని, కల్లుకు ప్రభుత్వమే మార్కెట్ సౌకర్యం కల్పించాలని, తాటి, ఈత చెట్లు నరికి వేస్తున్న వారిపై 1968 ఎక్సైజ్ చట్టం ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. చెట్టుకు కనీసం ఐదు రూపాయల పన్ను కట్టించుకుని చెట్లపై గీత కార్మికునికి హక్కు కల్పించాలని, పింఛను రూ.5 వేలు పెంచాలని, వృత్తిలో చనిపోయిన కుటుంబాలకు తక్షణ సహాయం, దహన సంస్కారాలకు రూ.50 వేలు, గాయాలైన వారికి వైద్య ఖర్చులకు రూ.25 వేలు చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్ని జిల్లా కేంద్రాల్లో నీరా, తాటి, ఈత ఉత్పత్తుల పరిశ్రమలు ప్రోత్సహించాలని, 2020 లాక్ డౌన్ కాలంలో ఉపాధి కోల్పోయిన గీత కార్మికుల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున ఇవ్వాలని, నవరత్నాల పథకంలో గీత కార్మికులను చేర్చాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కల్లు పాలసీలో ఈ మార్పులు చేసి ఎక్సైజ్ డిపార్ట్‌మెంటు ద్వారా అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో కోమటి శ్రీనివాస్, బొక్కా చంటి, కడలి పాండు, నిచ్చనకోళ్ల సూర్యచంద్రరావు, గుబ్బల రాఘవులు, బొంతు శ్రీనివాస్, మన్యం గంగరాజు, కోమటి సత్యనారాయణ, దొంగ సత్యనారాయణ, చింతపల్లి చిన్న వీరస్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జుత్తిగ నరసింహమూర్తి

వెదురు నరుకు పనులు ప్రారంభించాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఆదివాసీ కొండరెడ్ల గిరిజనులకు జీవనాధారమైన వెదురు నరుకు పనులు వెంటనే ప్రారంభించాలని పిడిఎస్‌యు మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.రామ్మోహన్ డిమాండ్ చేశారు. జిల్లా ఏజెన్సీ అటవీ ప్రాంతంలో వెదురు ఉత్పత్తి విస్తృతంగా కలిగి ఉంటుంది. ఆ ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసీ కొండరెడ్ల గిరిజన ప్రజలు కొండపోడు వ్యవసాయం మీద ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారు. సంవత్సరానికి ఒకసారి అక్టోబర్ నుంచి ప్రారంభమయ్యే వెదురు నరుకు పనులకు కార్మికులుగా, కూలీలుగా పని చేస్తూ ఉంటారు. ఇప్పటికే సుమారు రెండు నెలల ఉపాధి కోల్పోయారు. ఫారెస్ట్ అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం ఇప్పటికైనా ఏలూరు జిల్లా ఏజెన్సీ అటవీ ప్రాంతంలో వెదురు నరుకు పనులు ప్రారంభించి ఆదివాసీ కొండ రెడ్ల గిరిజనులకు పనులు కల్పించాలని డిమాండ్ చేశారు.

విలేజ్ క్లినిక్ భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - ఆగిరిపల్లి


శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ ప్రతాప్

గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సదుపాయాలను అందుబాటులోనికి తేవడమే విలేజ్ క్లినిక్ ముఖ్య ఉద్దేశమని, ఈ సదుద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేసిందని నూజివీడు నియోజకవర్గ ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండల పరిధిలోని వట్టిగుడిపాడులో నిర్మించ తలపెట్టిన విలేజ్ క్లినిక్ నూతన భవన నిర్మాణానికి ఆయన ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు పి.వీరబాబు, వట్టిగుడిపాడు సర్పంచి వై.కిరణ్మయి, వైసిపి నాయకులు జి.ఇస్సాక్, వై.ప్రకాష్, సిహెచ్.సీతారామరాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామిరెడ్డి, వెంకటేశ్వరరావు త్యాగాలు మరువలేనివి

ప్రజాశక్తి - చింతలపూడి

రామిరెడ్డి, వెంకటేశ్వరరావుల నిబద్ధత, అంకితభావం, ప్రజా సమస్యలపై వారు చేసిన పోరాటాలు, త్యాగాలు మరువలేనివని సిపిఐ సీనియర్ నాయకులు పూలపాటి సోమశేఖర్ అన్నారు. రామిరెడ్డి, వెంకటేశ్వరరావుల వర్ధంతి సభ ఎర్రగుంటపల్లి సిపిఐ కార్యాలయంలో పుల్లూరి సోమశేఖరాచార్యులు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు జంగా రామచంద్రారెడ్డి, గంధ శ్రీనివాసరెడ్డి, కారుమంచి పూర్ణచంద్ర, రమేష్, పంచాయతీ వార్డు మెంబర్ ఉమ్మడి వెంకటేష్, ఏడుకొండలు, ఉమ్మడి రాజారావు, కనుమ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు పుల్లూరి శ్రీరామాచార్యులు, తలారి గంగరాజు, ఆరేపల్లి వెంకట సుబ్బారావు, రాజబోయిన శ్రీనివాసరావు, జనార్దనాచారి బ్రహ్మాచారి, మాధవరావు, కృష్ణ, కుటుంబరావు, రాజబోయిన నారాయణ, కప్పాల సర్వేశ్వరరావు, ఉప్పే కుమార్, దాకారి శివాజీ, దారా ప్రశాంత్, మారుమడి రామారావు, సాధు మరియమ్మ, మార్తమ్మ, బాలమర్తి వెంకమ్మ, జయమ్మ పాల్గొన్నారు.


లక్ష్మికి నివాళులర్పిస్తున్న నాగమణి

లక్ష్మీ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని సిరివారిగూడెం గ్రామంలో మధ్యాహ్న భోజనం కార్మికురాలు లక్ష్మి సేవలు మరువలేనివని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి మొడియం నాగమణి అన్నారు. సిరివారిగూడెంలో ఆదివారం నిర్వహించిన సంతాభ సభ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం నాగమణి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికురాలిగా పనిచేస్తూ మండలంలోని మిడ్ డే మీల్ వర్కర్ల సమస్యలపై అనేక ఉద్యమాల పోరాటాల్లో ముందుండి నాయకత్వం వహించిన లక్ష్మి మృతి బాధాకరమన్నారు. మధ్యాహ్న భోజన యూనియన్ మండలంలో బలపడడానికి ప్రధాన పాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్.కొండలరావు, సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు, తెల్లం రామకృష్ణ, రైతు సంఘం మండల కార్యదర్శి సిరిబత్తుల సీతారామయ్య, జిల్లా నాయకులు ఎ.శ్యామలారాణి, అనసూర్య, పసుపులేటి రోసమ్మ లక్ష్మి, వెంకటేశ్వరి పాల్గొన్నారు..



కుట్టుమిషన్ అందుకుంటున్న మహిళలు

మహిళలకు కుట్టుమిషన్లు అందజేత

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

హోప్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో రివైవల్ రిస్క్యూ సెంటర్ క్రిస్మస్ సెలబ్రేషన్స్ సందర్భంగా ఆంధ్ర, తెలంగాణలో ఈ మిషన్ ద్వారా ఆరు వేల మందికి పైగా మహిళలకు కుట్టు మిషన్లు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా బుట్టాయగూడెంలో మహిళలకు శిక్షణ ఇచ్చి మిషన్లు అందించారు. ఈ కార్యక్రమాన్ని హోప్ మినిస్ట్రీస్ డైరెక్టర్ గడ్డం సామ్యూల్ జాషువా నిర్వహిస్తున్నారు. జంగారెడ్డిగూడెం పాస్టర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎన్.డేవిడ్‌రాజు, హోప్ మినిస్ట్రీస్ స్టాఫ్ జి.బాలాజీ శ్యామ్ విమోచన ఛానల్ డైరెక్టర్ కిరణ్, కుట్టు మిషన్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపల్ కాకర్ల రాణి పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

తల్లిదండ్రుల చెంతకు అదృశ్యమైన విద్యార్థి


ప్రజాశక్తి - టి.నరసాపురం

అదృశ్యమైన బాలుడు క్షేమంగా తల్లిదండ్రుల వద్దకు చేరాడు. ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కోనసీమ జిల్లా అల్లవరం మండలం గోడిలంక గ్రామానికి చెందిన 15 ఏళ్ల భరత్‌రామ్ అప్పలరాజుగూడెం గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 17వ రాత్రి పది గంటలకు హాస్టల్లో నిద్రపోయిన అతడు 18న ఉదయం 6.30 గంటలకు హాస్టల్ సిబ్బంది పరిశీలించగా కనిపించలేదని సమాచారం తెలుసుకున్న విద్యార్థి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అదృశ్యమైన విద్యార్థి తెల్లచొక్కా, నల్లటి షార్ట్ ధరించి ఉన్నాడని, ఆచూకీ తెలిసిన వారు 9440796676 నెంబరుకి సమాచారం అందించాలని తెలిపారు. సాయంత్రం సమయంలో తాడేపల్లిగూడెం బస్టాండ్‌లో బాలుని ఆచూకీ తెలిసింది. తాడేపల్లిగూడెం బస్టాండ్‌లో బాలుడు అనుమానాస్పదంగా తిరుగుతుండడతో ప్రయాణికులు ఆరా తీసి టి.నరసాపురం ఎస్ఐకు సమాచారం అందించారు. వారు బాలుడుని తల్లిదండ్రులకు అప్పగించారు.

మండవల్లిలో కుక్కల స్వైర విహారం

పట్టించుకోని అధికారులు

భయాందోళనలో గ్రామస్తులు


మండవల్లిలో కుక్కల గుంపు

ప్రజాశక్తి - మండవల్లి

మండల కేంద్రమైన కుక్కల స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులు గుంపులుగా తిరుగుతూ వాహనదారులు పాదాచారుల వెంటపడి మరి కరుస్తున్నాయి. దీంతో రోడ్లపై నడవాలంటే భయాందోళన చెందాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. జాతీయ రహదారి పామర్రు దిగమర్రు 165పై కుక్కల స్వైర విహారం ఎక్కువైపోయింది. మండవల్లి వద్ద నుంచి భైరవపట్నం అగ్రహారం వరకు ఐదుచోట్ల నివసిస్తూ గుంపులు గుంపులుగా సంచరిస్తూ రోడ్లపై నిలుచున్నవారిని, పాదచారులను, వాహనదారులను వెంటబడి మరి గాయపరుస్తున్నాయి. ఆ ప్రాంతం దాటాలంటే పెద్ద సాహసం చేయాల్సిన పరిస్థితి నెలకొందని గ్రామస్తులు, వాహనదారులు స్పష్టం చేస్తున్నారు. కుక్కలు కరవడానికి వెంటపడే సమయంలో ప్రాణభీతితో వాహనాలను నడుపుతూ ప్రమాదాలకు గురవడం లేక కుక్క కాటుకు గురవడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా రాత్రి వేళల్లో గ్రామంలో ఉన్న గొర్రెలను, మేకలను, కోళ్లను చంపేస్తున్నాయంటూ పలువురు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకురావడంతో పాటు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు కూడా చేసినట్లు వాహనదారులు వివరిస్తున్నారు. పగటి పూటే విచ్చలవిడిగా వెంటబడి కరుస్తున్నాయని ఇక రాత్రివేళలో వాహనదారులను వెంటబడి తరుముతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా రక్షక భటులు కూడా కుక్కల భయంతో మండవల్లిలో రాత్రి వేళల్లో బీట్ నిర్వహించలేని పరిస్థితుల నెలకొన్నాయి. కుక్కలు కరవకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులను కోరినప్పటికీ వారు ఎటువంటి చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వందల సంఖ్యలో వాహనదారులు, గ్రామస్తులు, పాదచారులు కుక్కకాటుకు గురయ్యారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో చిన్నారులను పాఠశాలలకు పంపించాలన్న వివిధ అవసరాలపై బయటికి వెళ్లాలన్న కుక్క కాటుకు గురవుతామని భయాందోళన చెందాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు. కుక్క కాటు నుంచి ప్రజలను కాపాడాలని స్వచ్ఛంద సంస్థలు ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు గ్రామస్తులు గ్రామసభల్లో స్పందన కార్యక్రమం ద్వారా పలుమార్లు వినతులు సమర్పించిన ఎవరు పట్టించుకోలేదని వారు తెలుపుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ప్రజలను కుక్కలు కరవకుండా చర్యలు తీసుకోవాలని ముక్తకంఠంతో వేడుకుంటున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావును వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మహిళలు క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి - ఉంగుటూరు

మహిళలు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రావీణ్యం చూపించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ బి.రాంగోపాల్ అన్నారు. మండలంలోని నారాయణపురం శ్రీఅరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో రెండు రోజుల పాటు నిర్వహించే అంతర కళాశాలల, ఆదికవి నన్నయ్య విశ్వ విద్యాలయం మహిళా కబడ్డీ టీమ్ ఎంపిక పోటీలు ఆదివారం మొదలయ్యాయి.


కబడ్డీ ఆడుతున్న వివిధ కళాశాలల జట్లు


మాట్లాడుతున్న స్పోర్ట్స బోర్డు సెక్రటరీ రాంగోపాల్

పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ టికె.విశ్వేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా స్పోర్ట్సు బోర్డు సెక్రటరీ పాల్గొన్నారు. విశ్వవిద్యాలయం పరిధిలో 14 కళాశాలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. ఇక్కడ ఎంపికైన టీమ్ ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం జట్టుగా దక్షిణ భారత విశ్వవిద్యాలయం క్రీడా పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారన్నారు. కళాశాల పీడీ డాక్టర్ పి.రాజామెరిసన్‌బాబు, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి, విశ్రాంత పీడీ ఆదిరెడ్డి సత్యనారాయణ, చేబ్రోలు ఎస్ఐ కె.స్వామి, సెలక్షన్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు. తొలుత ప్రారంభోత్స కార్యక్రమంలో చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

'మానవత' సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - భీమడోలు

పేదరికం నేపథ్యంలో కుటుంబసభ్యుల సహాయ సహకారాలతో ఐఎఎస్, ఇంజినీరింగ్, మెడికల్ విద్యను అభ్యసించి జీవితంలో స్థిరపడనున్న వారిని గుర్తించి వారి ద్వారా భవిష్యత్తులో మానవత సంస్థ ఆధ్వర్యంలో ఇతర విద్యార్థులకు సహాయ సహకారాలు అందించే క్రమంలో వారిని ప్రోత్సహిస్తున్నట్లు మానవతాసంస్థ జిల్లా అధ్యక్షులు రామిశెట్టి గంగాధరరావు తెలిపారు. భీమడోలులో మానవతా, భీమడోలు శాఖ అధ్యక్షులు పచ్చా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలలో ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో స్థిరపడనున్న పనస తేజ, జి.నందకిషోర్‌లను సత్కరించారు. సంస్థ తరపున మెమోంటో అందించారు. మానవతా సంస్థ జిల్లా విద్యానిధి నుంచి మంజూరైన నగదు పురస్కారాలను వారికి అందించారు. వారు ఇంతటి స్థాయికి ఎదగడానికి కారకులైన వారి తల్లిదండ్రులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మానవతా సభ్యులు జి.నూకరాజు, అప్పారావు, జి.రామాంజనేయులు సంస్థ విద్యానిధి కమిటీ జిల్లా ఛైర్మన్ అలపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.


విద్యార్థుల కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న వక్తలు

ఘనంగా యూత్ క్రిస్మస్ వేడుక

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

సెయింట్ మార్క్స్ లూథరన్ చర్చిలో బుట్టాయగూడెం చర్చికి సంబంధించిన యువకులు, పిల్లలు యూత్ క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. యూత్ క్రిస్మస్ సందేశాన్ని ఎం.మణికాంత్ ఇచ్చారు. అనంతరం యూత్ వారు కేక్ కటింగ్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్ ఎం.ఎ.ఆమెన్, డెలిగేట్ సూర్యప్రకాష్‌రావు పిసిసి, ఎల్‌సిసి సభ్యులు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణకు ఉద్యమించాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

హక్కుల పరిరక్షణకు కార్మిక వర్గం ఉద్యమించాలని న్యాయవాది యు.ఏసుబాబు పిలుపునిచ్చారు. ఆదివారం ఐఎఫ్‌టియు డివిజన్ విస్తృతస్థాయి సమావేశం ధర్మన్న మెమోరీ హాలులో డివిజన్ అధ్యక్షులు బోనంగి చిన్నబ్బాయి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన యు.ఏసుబాబు మాట్లాడుతూ కార్మిక ఉద్యోగ వర్గాలు అనేక పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులను నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. ఉద్యోగ కార్మిక వర్గాలను విభజించి పాలిస్తూ వారి మధ్య చీలికలు తెస్తూ ఉద్యమాలను బలహీనపరుస్తున్నారన్నారు. ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు కెవి.రమణ మాట్లాడుతూ క్షేత్రస్థాయి నుంచి కేంద్ర స్థాయి వరకు ఐఎఫ్‌టియు మహాసభ ప్రారంభమయ్యాయని తెలిపారు. జనవరి ఎనిమిదో తేదీన జంగారెడ్డిగూడెం డివిజన్ మహాసభ జరుగుతుందని తెలిపారు. ఈ మహాసభలను కార్మిక వర్గం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నిర్మాణ కార్మిక సంఘం నాయకులు మంచిలి రాజు, బాలం నరేష్, సివిల్ సప్లై నాయకులు ముప్పిడి అబ్బులు, మిసాల ఏసు, తమ్మా సోమలింగ, మల్లికార్జునరావు, బుట్టాయగూడెం మండల నాయకులు షేక్ బాజీ, గవర్నమెంట్ టింబర్ డిపో నాయకులు తగరం బాబూరావు మిఠాయి వర్కర్స్ నాయకులు ప్రసాద్, ప్రగతిశీల అంగన్‌వాడీ యునియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి.శిరోమణి, టి.రాణి పాల్గొన్నారు.

పింఛన్ ఇప్పించరూ..!

వితంతు మహిళ ఆవేదన

ప్రజాశక్తి - ముసునూరు

తన భర్త చనిపోయినా బతికే ఉన్నాడని తనకు పెన్షన్ నిలిపివేశారని ఓ మహిళ ఆవేదన చెందుతోంది. మండల కేంద్రమైన ముసునూరు గ్రామానికి చెందిన చట్టుమల అన్నమ్మ భర్త చనిపోయిన తర్వాత ఐదు నెలల వరకు పెన్షన్ ఇచ్చారు. అనంతరం పెన్షన్ నిలిచిపోయింది. దీంతో బాధిత మహిళ అధికారులకు విషయం తెలిపిన తన సమస్య వివరించింది. ఆమె భర్త బతికే ఉన్నాడని ఆన్‌లైన్‌లో చూపటంతో పెన్షన్ నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. దీంతో ఆమె నూజివీడు డివిజన్ అధికారులకు సమస్య వివరించింది. తనకు పెన్షన్ అందించాలని కోరుతోంది.

సొసైటీ అధ్యక్షులు రాంబాబుకు ఎంఎల్ఎ పరామర్శ


మొక్క నాటుతున్న ఎంఎల్ఎ బాలరాజు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని దర్భగూడెం పంచాయతీలోని లక్ష్మీపురంలో వైసిపి సీనియర్ నాయకులు, సొసైటీ అధ్యక్షులు కొల్లూరి రాంబాబు సతీమణి కొల్లూరి పద్మావతి ప్రథమ వర్ధంతి సభలో పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు పాల్గొని ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎంఎల్‌తో పాటు కాంగ్రెస్ పార్లమెంటరీ ఇన్‌ఛార్జి జెట్టి గురునాధరావు, టి.నరసాపురం జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి సూరిబాబు, మెడవరపు అశోక్, నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి పలువురు ప్రముఖులు హాజరై ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దర్భగూడెం పంచాయతీలో పర్యటించిన ఎంఎల్ఎ లక్ష్మీపురంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం నూతన సచివాలయంలో సర్పంచి సున్నం ఉషారాణితో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కోర్స పోసమ్మ, జెడ్‌పిటిసి సభ్యులు వసంతరావు, ఎంపిటిసి సభ్యులు సున్నం సురేష్, సుధారాణి, ఉప సర్పంచి రాఘవరెడ్డి, నాయకులు బోధ శ్రీనివాస్, ప్రసాద్, కోర్స వెంకటేశ్వరావు, గుర్రాల సురేష్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి


అగ్ని బాధితులను పరామర్శిస్తున్న కె.విష్ణువర్ధన్

మండలంలోని కొరగుంటపాలెం పంచాయతీ శివారు రాజనగరంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి కట్టుబట్టలతో బయటపడ్డ గ్రామానికి చెందిన గుడిసే వెంకటేశ్వరరావు కుటుంబానికి ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సాయం అందించారు. కృష్ణ, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కోమటి విష్ణువర్ధన్ బాధిత కుటుంబసభ్యులను ఆదివారం పరామర్శించి ధైర్యం చెప్పి రూ.37 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, గ్రామ సర్పంచి పేరే రామకృష్ణ, అల్లూరు సర్పంచి శీలం రామకృష్ణ, ముదిరాజ్ సంఘం కమిటీ సభ్యులు జి.ఏసుబాబు, ఎం.నాగమల్లేశ్వరరావు, పరసా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొంగలు.. అన్నదాతల నేస్తాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

కొంగలు రైతులకు ఎంతో మేలు చేస్తున్నాయని చెప్పుకోవచ్చు. ఆరుతడి పంటలు సాగు చేసేందుకు ట్రాక్టర్‌తో దమ్ము చేసే సమయంలో ఆచేల్లో ఉండే క్రిమికీటకాలు, భూమిలో ఉండే పురుగు, పుట్రాను కొంగలు తింటూ పొట్ట నింపుకోవడంతో పాటు రైతులకు ఎంతో మేలు చేస్తున్నాయి. ఇదీ నిన్న మొన్నటిది కాదని, పూర్వం నుంచి చేలల్లో దమ్ములు చేసే సమయాల్లో తెల్లకొంగలు గుంపులు గుంపులుగా వచ్చి క్రిమి కీటకాలను భక్షిస్తూ రైతులకు సాయ పడుతున్నాయని పలువురు రైతులు చెబుతున్నారు. ముదినేపల్లిలోని అన్నవరం రోడ్డులో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద దమ్ములు చేస్తున్న పంట పొలాల్లో తెల్లటి కొంగలు క్రిమి కీటకాలను తింటున్న దృశ్యాలు ప్రజాశక్తి కెమెరాకు చిక్కాయి. కేవలం పంట పొలాల్లోనే కాకుండా వాణిజ్య పంటలపై వ్యాపించే చీటపీడలను సైతం ఈ కొంగలు చెదురు, మదురుగా వచ్చి రైతులకు మేలు చేస్తూ రైతు నేస్తాలుగా పేరొందాయి.


దమ్ము చేస్తున్న సమయంలో గుంపులుగా వచ్చి వాలిన కొంగలు

ఘనంగా ఎంపీ రామ్మోహన్ నాయుడు పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

శ్రీకాకుళం ఎంపీ కింజారపు రామ్మోహన్ నాయుడు పుట్టినరోజు వేడుకలను స్థానిక టిడిపి నేతల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి చిట్టిబోయిన రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ దాసరిశ్యామ్‌చంద్రశేషు పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా శేషు మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాలను కాక దేశ రాజకీయాల్లో కూడా చెరగని ముద్ర వేస్తున్న కింజారపు రామ్మోహన్ నాయుడు దేశం తరపున ఐక్యరాజ్యసమితిలో ప్రసంగించడం ప్రశంసనీయం అన్నారు. రాష్ట్ర హక్కులపై సమస్యలపై పార్లమెంటులో తన గళాన్ని వినిపిస్తూ రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం పోరాటం చేస్తున్న రామ్మోహన్ నాయుడు భవిష్యత్తులో మరిన్ని ఉన్నతమైన పదవులు అధిరోహించాలని, ఆయన మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి పగడం సౌభాగ్యవతి, నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షులు సీలామంతుల రాంబాబు, బిసి సెల్ మండల అధ్యక్షుడు భూస సత్యనారాయణరెడ్డి, ఎస్‌సి సెల్ అధ్యక్షులు గొల్లమందల శ్రీనివాస్, జంగారెడ్డిగూడెం పట్టణ తెలుగు యువత ఉపాధ్యక్షులు మల్లిపూడి నవీన్, పోలవరం నియోజకవర్గ తెలుగు యువత నాయకులు పారేపల్లి నరేష్, ఎస్‌సి సెల్ అధికార ప్రతినిధి తాళ్లూరు వెంకటేశ్వరరావు, జోషి నవీన్ సిద్ధు పాల్గొన్నారు.

పలుచోట్ల 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని ప్రగడవరం పంచాయతీ నరసింగపురం, కంచనగూడెం, దేశవరం గ్రామాల్లో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని క్లస్టర్ కో-ఆర్డినేటర్ చిలుకూరు సుధీర్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి ప్రగడవరం గ్రామ కమిటీ అధ్యక్షులు తాళ్లురి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఒక్క అవకాశం పేరు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను మర్చిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి మాజీ సభ్యులు కనుమ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, బిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు కొప్పురపు నాగరాజు, మానేపల్లి రాజారావు, కెటిఆర్ సెక్రటరీ బుద్దాల నాగవర్ధన్‌రావు, రెండో వార్డ్ మెంబర్ జగ్గవరపు శ్రీనివాసరెడ్డి, 16వ వార్డు ముంబర్ నల్ల గోపు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

'ప్రజలకు నష్టదాయకంగా వైసిపి'

నూజివీడు : ప్రజలకు నష్టం చేకూర్చే ప్రభుత్వాన్ని దేశంలో మరెక్కడ చూడలేదని, మన రాష్ట్రంలోనే వైసిపి ప్రభుత్వం ప్రజలకు నష్టదాయకంగా మారిందని టిడిపి నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని 12వ, 32వ వార్డుల్లో ఆదివారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూజివీడు పట్టణంలో అభివృద్ధి చేసి చూపించింది టిడిపి ప్రభుత్వమేనన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి పల్లి నాగరాజు, 12వ వార్డ్ కౌన్సిలర్ తిరుమలశెట్టి సాధన లక్ష్మీ స్రవంతి, తిరుమల శెట్టి ప్రదీప్‌కుమార్, 17వ వార్డు కౌన్సిలర్ దాసరిస్వామి, వన్డే కారి రంగారావు, జాదం లక్మోజి, జొన్నలగడ్డ శివలక్ష్మి, 32వ వార్డు ఏలూరు పార్లమెంట్ తెలుగు మహిళ కమిటీ సభ్యులు గొల్లు దుర్గాదేవి, జివి.రామారావు, కందుపల్లి చెన్నారావు పాల్గొన్నారు.

డాక్యుమెంట్లు పోయినవి

ఏలూరు జిల్లా, ఏలూరు నగరము, శాంతినగర్ కాపురస్తులు యలవర్తి ఉమాదేవి, భర్త: వెంకటేశ్వరరావు అను మావి మరియు మాకు సంబంధించిన తేది. 30-10-2012 **లింకు డాక్యుమెంటు నెం. 9236/2012,** ఏలూరు శాంతినగర్ 5వ రోడ్డు మా ఇంటి నుండి ది. 21-10-2022వ తేదీన సెంటరుకు వెళ్ళి జిరాక్స్ కాపీలు తీయించుకొనుటకు బైక్‌పై తగిలించుకొని వెళ్ళుచుండగా కవరు దారిలో పడిపోయినది. మళ్ళీ ఎంత వెతికినా దొరికలేదు. కావున ఈ దస్తావేజు దొరికిన వారు ఈ ఫోన్ నెంబరుకు తెలియచేయవలసినదిగా కోరుచున్నాను.

యలవర్తి ఉమాదేవి
సెల్: 9399911148

In the Court of the I Additional Junior Civil Judge, Tanuku
O.S. 286/2020

Between:
Bank of Baroda (Erstwhile Vijaya Bank), Alamuru ...*Plaintiff*
Vs
Tholeti Venkata Krishnarao and Another ...*Defendants*

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:
1. తోలేటి వెంకట కృష్ణారావు, S/o. నాగరాజు, హిందువు, పు॥ 50 సం॥లు, డో.నెం. 22-1-5/1, పాలకొల్లు.
2. వేముల వెంకటలక్ష్మి, W/o. వర్ధనరావు, హిందువు, స్త్రీ, 34 సం॥లు, డో.నెం. 27-4-18, పాలకొల్లు.

పై నెంబరు దావా గ్రంధములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది. 20-12-2022వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయముగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను, అట్లు కాని యెడల మీపై పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.

ఎన్.రవిశంకర్
అడ్వకేట్, తణుకు